ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

ఆదివారం 16 జూన్ 2024 | 3







సర్వ పుష్పాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

భక్తవత్సల గోవిందా

▸▸ వాడపల్లి వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు... శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.38.84 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 15: కోనసీమ తిరుమల వాడపల్లికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే సుప్రభాత సేవ, ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాలభోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించి శ్రీవేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో బారులు తీరి గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే విజేత పచ్చిమట్ల ధర్మరాజు స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం చేయించిన అనంతరం వేదాశీర్వచనం ఇప్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.38,84,859 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.



ఉంగుటూరు ఎమ్మెల్యే విజేత ధర్మరాజుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో కిశోర్‌కుమార్

రేపు అప్పనపల్లి బాలబాలాజీ తిరు కల్యాణం

మామిడికుదురు, జూన్ 15: వైనతేయ నదీ తీరంలో వేంచేసియున్న అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయం కల్యాణోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని వివిధ రంగులతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఏడు శనివారాలు ఏడుప్రదక్షిణలు చేసి ఏడు నారికేళాలు సమర్పించినంతనే కోరిన కోర్కెలు నెరవేర్చే శ్రీబాలబాలాజీ స్వామి తిరు కల్యాణాన్ని సోమవారం రాత్రి 8.59 గంటలకు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేసి కల్యాణ శోభను తీసుకువచ్చారు. ఆదివారం ప్రారంభమయ్యే కల్యాణోత్సవాలు 20న శ్రీపుష్పయాగంతో ముగుస్తాయి. ఐదు రోజులు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. స్వామివారి తిరు కల్యాణాన్ని చినజీయర్ స్వామి శిష్యుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులు కల్యాణోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని సహాయ కమిషనరు, ఈవో గ్రంధి మాధవి కోరారు.

అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,80,050 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనరు జి.మాధవి తెలిపారు. 3,697 మంది దర్శించుకోగా 3,051 మంది అన్నప్రసాదం స్వీకరించారని ఆమె చెప్పారు.

మహిళలు, సామాన్యుల భద్రతే లక్ష్యం

▸▸ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

▸▸ అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

అంతర్వేది, జూన్ 15: గత ఐదు సంవత్సరాల్లో నలిగిపోయిన మహిళలు, సామాన్య ప్రజలకు భద్రత కల్పించే దిశగా పని చేస్తానని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని సహించేది లేదన్నారు. సామాన్యులు ఆస్తులు పోగొట్టుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. గత ఐదేళ్లుగా గంజాయి, మత్తు పదార్థాలతో రాష్ట్రం సర్వనాశనమైపోయిందని, యువత వాటి బారిన పడకుండా, మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా పోలీసు శాఖతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో అమలాపురం, మోరిపోడుల్లో ఆడపిల్లలకు అన్యాయం జరిగినప్పుడు కుటుంబాలను పరామర్శించానని, భవిష్యత్తులో అటువంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు. మంత్రి వెంట సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, వనమాలి మూలాస్వామి, ముప్పర్తి నాని, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, అయినపర్తి ఏసు, ఎంపీటీసీ బైరా నాగరాజు, కూటమి నాయకులు వున్నారు. కూటమి విజయం సాధించిన తరుణంలో మలికిపురం నుంచి అంతర్వేది వరకు పాదయాత్ర చేస్తున్న అంతర్వేదిపాలెం పుల్లయ్యను హోం మంత్రి అనిత అభినందించారు.



హోం మంత్రి అనితకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం విచ్చేశారు. ఎన్నికల సమయంలో దర్శించుకుని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరలా దర్శించుకుంటానని కోరుకున్నానన్నారు. ఈ నేపథ్యంలో దర్శనానికి విచ్చేశానన్నారు. తొలుత ఆమెకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో దర్శనం చేయించి వేద పండితులతో మహదాశీర్వచనం ఇప్పించారు. మంత్రికి ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. నల్లా సత్యకిరణ్‌ప్రసాద్ భగవద్గీత, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని మోరి జీడిపప్పు అచ్చును హోం మంత్రికి అందించారు.

నకిలీ కౌలు రైతు కార్డుల జారీపై సమగ్ర విచారణ: తహసీల్దారు

ఆలమూరు, జూన్ 15: భూముల యజమానులకు తెలియకుండా కౌలు రైతు కార్డులు మంజూరు చేయడంపై రైతు నాయకులు దునే స్వామినాయుడు, రాయుడు బాబ్జీ, రాయుడు సతీష్, వడ్డి దొరయ్య అధ్వర్యంలో నర్సిపూడి రైతులు తహసీల్దారు అనిల్‌కుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. నర్సిపూడిలో 'భూమి ఒకరిది.. రుణం మరొకరికి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 14న కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతులు తహసీల్దారును కలిశారు. తమ భూములపై బ్యాంకులో రుణాలు మంజూరు చేయడంతో ఎటువంటి రుణాలు తీసుకోవడానికి వీలుకావట్లేదన్నారు. నకిలీ కౌలు రైతు కార్డులతో నర్సిపూడి గోదావరి గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.లక్షల్లో రుణాలు మంజూరు చేశారని రైతులు వాసిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, రాయుడు లక్ష్మి ఫిర్యాదు చేశారు. కౌలు రైతు కార్డుల మంజూరుపై అప్పటి వీఆర్వో డి.సుదర్శన్‌ను పిలిచి రైతుల సమక్షంలో విచారణ చేపట్టారు. అప్పట్లో పని ఒత్తిడి అధికంగా ఉండడంతో పాటు నర్సిపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఒత్తిడి చేయడంతో రైతులకు తెలియకుండా కార్డులు జారీ చేశానని వీఆర్వో సుదర్శన్ వివరించారు. పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు అనిల్‌కుమార్ చెప్పారు.

నర్సిపూడిలో నకిలీ కౌలు రైతు కార్డుల వ్యవహారం వెలుగుచూసిన నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో విచారణ చేస్తామని తహసీల్దారు అనిల్‌కుమార్ చెప్పారు. నర్సిపూడి ఘటనపై రైతుల ఫిర్యాదు నేపథ్యంలో ఆ గ్రామంతో పాటు మిగిలిన గ్రామాల్లో విచారణ చేసి పూర్తి నివేదికను వారంలో ఆర్డీవోకు అందజేస్తానని చెప్పారు.



చింతలపల్లిలో బోరు బావి నుంచి గ్యాస్‌తో పాటు నీరు ఎగజిమ్ముతున్న దృశ్యం

చింతలపల్లిలో బోరు బావి నుంచి ఎగసిపడ్డ గ్యాస్

రాజోలు, జూన్ 15: మండలంలోని చింతపల్లిలో శనివారం బోరు బావి నుంచి గ్యాస్ ఎగసిపడడంతో స్థానికులు ఆందోళన చెందారు. రాజోలు అగ్నిమాపక అధికారి సీహెచ్ అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... చింతలపల్లిలో కె.విజయేంద్రవర్మ ఆక్వా చెరువుల వద్ద రెండు సంవత్సరాల క్రితం బోరు బావి వేశారు. ఈ బావి నుంచి శనివారం ఉదయం ఒక్కసారిగా పన్నెండు మీటర్లు పైకి గ్యాస్‌తో పాటు నీరు ఎగజిమ్మింది. దీంతో ఆందోళన చెందిన స్థానికులు రాజోలు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. రాజోలు అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నర్సాపురం ఓఎన్జీసీ అధికారులకు ఆయన సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు గ్యాస్‌తో పాటు నీరు ఎగజిమ్మడం ఆగిపోయింది. బోరు బావి నుంచి గ్యాస్ ఎగజిమ్మిన చోట పెద్ద గొయ్యి ఏర్పడింది. ఓఎన్జీసీ సిబ్బంది అక్కడ సిమెంటుతో కూడిన కాంక్రీటు వేసి ఆ గొయ్యిని పూడ్చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామకృష్ణ, సీఐ దొరరాజు

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం కేసులో వైసీపీ సర్పంచ్, మరో వ్యక్తి అరెస్టు

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం యర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన కేసులో ఆ గ్రామ సర్పంచ్‌తో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేశారు. రామచంద్రపురంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రామకృష్ణ తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి యర్రపోతవరం లాకుల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎడమ చేతికి చెప్పులదండ వేశారు. దీనిపై విప్పర్తి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పామర్రు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు అడిషినల్ ఎస్పీ కె.ఖాదర్‌బాషా పర్యవేక్షణలో డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ దొరరాజు, ఎస్ఐలు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సర్పంచ్ పిల్లి రాంబాబు (బీసీ సామాజికవర్గం), కోరుకొండ స్వామినాయుడు (ఎస్సీ సామాజికవర్గం) పథకం ప్రకారం 8వ తేదీ రాత్రి స్వామినాయుడు ఇంటిపక్కనున్న చెత్తకుప్పలోంచి సేకరించిన మూడు చెప్పులను దండగా కట్టి, తెల్లకాగితంపై కొన్ని వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా అవమానకర రీతిలో రాసి అట్టముక్కకు అంటించారు. తర్వాత ప్లాస్టిక్ వైరు కట్టి చెప్పులదండ, బోర్డును అదే రోజు రాత్రి విగ్రహం ఎడమ చేతికి తగిలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో పాటు పలు రకాలు సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి వివిధ కోణాలలో సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించారు. వారు విచారణలో నేరం అంగీకరించారు. దీంతో శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులు నేరానికి ఉపయోగించిన వస్తువులు, సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి ఛేదించిన దర్యాప్తు అధికారి డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ దొరరాజు, ఎస్ఐ జానీబాషా, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు. వర్గాల మధ్య గొడవలు సృష్టించేందుకు ఈవిధమైన కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని డీఎస్పీ హెచ్చరించారు.

నేడు రామచంద్రపురం నియోజకవర్గానికి మంత్రి సుభాష్ రాక

జొన్నాడ నుంచి భారీ ర్యాలీ

...వివరాలు 6లో

జిల్లాలో 22 స్టాక్ పాయింట్ల ద్వారా విద్యా కిట్లు పంపిణీ: డీఈవో

ఆలమూరు, జూన్ 15: జిల్లాలో 22 స్టాక్ పాయింట్ల ద్వారా విద్యా కిట్లను పాఠశాలలకు తరలించి విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేసినట్టు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. ముందుగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, షూస్ పూర్తిస్థాయిలో అందిస్తున్నామని, యూనిఫామ్, బ్యాగులు రానున్నాయని వివరించారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌ను డీఈవో శనివారం స్టేట్ అబ్జర్వర్ మాధవీలతతో కలసి పరిశీలించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి వారు నూరు శాతం పాఠశాలలో ఉండేలా ఎంఈవోలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కమలకుమారి సూచించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని ప్రతీ పాఠశాల పరిధిలోనూ ఈనెల 19వ తేదీ వరకు ప్రత్యేకంగా నిర్వహించాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. బడికి వచ్చే ప్రతి విద్యార్థికీ కిట్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని డీఈవో చెప్పారు. పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న 'విద్యాప్రవేశ్' కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని డీఈవో పిలుపునిచ్చారు. జిల్లాలోని 1,240 ప్రాథమిక, 86 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 'విద్యాప్రవేశ్' కార్యక్రమం అమలు చేయాలన్నారు. 90 రోజులపాటు రోజువారీ కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో తెలుగు, గణితం అంశాల్లో ఫౌండేషన్ వేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. డీఈవో వెంట సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, ఎంఈవోలు పి.షాలెంరాజు, పి.సుబ్బరాజు, ఆలమూరు హైస్కూలు హెచ్ఎం బి.అప్పాజీ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ వి.నాగేశ్వరి, సీఆర్ఎంటీలు పి.శ్రీనివాసరావు, ఎ.వెంకటజ్యోతి, ఎం.కుమారి. వై.అపర్ణ వున్నారు.


2024 ఎన్నికల్లో
రామచంద్రపురం నియోజకవర్గంలో
శాసనసభ్యునిగా విజయం సాధించి
రాష్ట్రమంత్రిగా ప్రమాణస్వీకారం
చేసి విచ్చేయుచున్న మిత్రుడు
శ్రీ వాసంశెట్టి సుభాష్ గార్కి
కార్మికశాఖ. ఫ్యాక్టరీలు & ఇన్సూరెన్స్
మెడికల్ సర్వీసెస్ శాఖా మంత్రి వర్యులు
స్వాగతం
సుస్వాగతం
గుణ్ణం చంద్రమౌళి
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
రావిపాటి రవి
ఒబిలినేని సీతారామయ్య
యేలేటి బాబి
దొంగల శ్రీధర్
రావిపాటి వెంకట గణేష్‌చౌదరి
గుణ్ణం చంద్రమౌళి మిత్ర బృందం



అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, జూన్ 15: అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని హైదరాబాద్‌కు చెందిన పసుపులేటి సుజాత శనివారం దర్శించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకురూ.1,00,116 విరాళంగా అందజేశారు. వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేసి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

పుష్పమాలలు, శాలువాలు వద్దు

● మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 15: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా, సోమవారం తన జన్మదినం సందర్భంగా టి.డి.పి, జనసేన, బీజేపీ కార్యకర్తలు పూలదండలు, పుష్పగుచ్చాలు, శాలువాలు తీసుకురావద్దని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. అందుకు బదులుగా పాఠశాలలు తెరచినందున విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు తీసుకువస్తే పేద విద్యార్థులకు ఉపయోగించుకునే వీలు ఉంటుందన్నారు. ఏమీ తేకపోయినా పరవాలేదని పూలదండలు, పుష్పగుచ్చాలు, శాలువాలు తీసుకు వస్తే తిరస్కరిస్తే బాధపడవద్దని విజ్ఞప్తి చేశారు. తన జన్మదినం సందర్భంగా పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేశామని అందుకు యువత సహకరించాలని కోరారు.

మంత్రి సుభాష్‌ను కలసిన ఆర్టోస్ అధినేత జగన్నాథవర్మ



మంత్రిసుభాష్‌ను అభినందిస్తున్న వర్మ

రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శనివారం ఆర్టోస్ శీతలపానీయాల సంస్థ అధినేత అడ్డూరి జగన్నాథవర్మ విజయవాడలో కలిశారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వాసంశెట్టి సుభాష్‌ను పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, దివ్యాంగులు

ద్రాక్షారామ, జూన్ 15 : దివ్యాంగులు పింఛను రూ.3 వేలు నుంచి రూ.6వేలకు పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి శనివారం ద్రాక్షారామలో దివ్యాంగులు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చినమాట ప్రకారం దివ్యాంగులు పింఛను రెట్టింపు పెంచడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. దివ్యాంగుల ఆహ్వానం మేరకు సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, జనసేన నాయకులు కర్రా తాతీలు, సలాది శ్రీను, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

● ఏరుపల్లి గ్రామంలో వృద్ధులు సీఎం చంద్రబాబు, మంత్రి వాసంశెట్టి సుభాష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ చిల్లా గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పలువురు సామాజిక పింఛనుదారులు చంద్రబాబు, మంత్రి సుభాష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సుభాష్‌కు అభినందనలు తెలిపిన ఉపాధ్యాయ సంఘాల నేతలు



మంత్రి సుభాష్‌కు అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కె.గంగవరం, జూన్ 15: కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వాసంశెట్టి సుభాష్‌ను పీఆర్టీయూ నాయకుడు నరాల కృష్ణకుమార్, గుబ్బల శ్రీనివాస్, జాన్‌రత్నం, రాంబాబు, గౌరీశంకర్ శనివారం విజయ వాడలో కలిసి అభినందనలు తెలిపారు. జీవో నెం.117 రద్దు, ఐఆర్, సీపీఎస్ రద్దు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు మరివాడ చిన్ని కృష్ణ, మేడిశెట్టి రవికుమార్, జగతా రమణ, మేడిశెట్టి బాబి, తోట వెంకన్న మంత్రి సుభాష్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

సుభాష్ ర్యాలీని విజయవంతం చేయండి

కె.గంగవరం, జూన్15: రామచంద్రపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కార్మికశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారి నియోజకవర్గంలోకి వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని విజయవంతం చేయాలని జనసేన మండల కన్వీనర్ చిర్రా రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. జొన్నాడ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీకి కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

మెగా డీఎస్సీపై హర్షం

మలికిపురం, జూన్ 15: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబునాయుడు ఉపాధ్యాయుల కోసం తొలి సంతకం చేయడం హర్షణీయమని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, మలికిపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.పద్మనాభం, దుర్గాప్రసాద్‌లు అన్నారు. 16,347 పోస్టుల భర్తీ కోసం ఇచ్చిన మాట ప్రకారం జీవో 27 గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల అభినందన తెలిపారు.



ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావును సత్కరించిన పెన్షనర్లు



పి.గన్నవరంలో రహదారి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబు, కూటమి నేతలు



ఎంపీ హరీష్‌మాధుర్‌ను సత్కరిస్తున్న ఎస్టీయూ జిల్లా సంఘ నాయకులు

ఎన్నికల హామీల అమలుతో సుపరిపాలన

టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు

పి.గన్నవరం, జూన్ 15: ఎన్నికల హామీల అమలులో భాగంగా తొలి ఐదు సంతకాలతో సీఎం చంద్రబాబు సుపరిపాలనకు శ్రీకారం చుట్టారని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. పి.గన్నవరంలోని కూటమి పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి క్లస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్, సహ కన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, సభ్యులు తోలేటి సత్తిబాబు, మొల్లేటి శ్రీనివాస్, చిట్టూరి శ్రీనివాసరావు, శ్రీనురాజు, సంసాని పెద్దిరాజు, మద్దాల సుబ్బారావు, నూదా బాబ్జీ, శేరు శ్రీనుబాబు, సయ్యపరాజు సత్తిబాబురాజు, కుడిపూడి బుజ్జి, ముచ్చర్ల సాయిసత్యనారాయణ, వర్ధినీడి బాబ్జీ, నాగాబత్తుల సుబ్బారావు, గుడాల ఫణి, నిమ్మకాయల శేషయ్య పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధికి శ్రీకారం

రాష్ట్రంలో ఇప్పటివరకు రహదారుల అధ్వానంతో నానా అవస్థలు పడ్డామని, కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పి.గన్నవరం వార్ఫ్ నుంచి అక్విడెక్టు వరకు రోడ్డు పనులకు టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు కూట మి శ్రేణులతో కలిసి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పి.గన్నవరం వార్ఫ్ నుంచి చాకలిపాలెం వరకు సీఆర్‌ఎఫ్ నిధులు రూ.6కోట్లు మంజూరయ్యాయని, రోడ్డు పనులు కొంతమేర పూర్తయ్యాయన్నారు. మిగిలిన 300 మీటర్ల పనుల్లో భాగంగా 150 మీటర్ల వరకు సీసీ రోడ్డు ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే విజేతకు న్యాయవాదుల శుభాకాంక్షలు

పి.గన్నవరం ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణకు ది బార్ అసోసియేషన్ ఆఫ్ అమలాపురం ప్రతినిధులు శనివారం పూలమాలలు వేసి సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయిరాం, ప్రధాన కార్యదర్శి నందిక శ్రీనివాస్, లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు జోగేష్, సీనియర్ న్యాయవాదులు అడపా ప్రసాద్, మాకిరెడ్డి ఆదినారాయణ, నందెపు చిన వెంకటేశ్వరరావు, గుండాబత్తుల రవితేజ, శ్రీనివాస్, బి.వెంకటేష్ పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా'



రాయవరంలో ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న వెలుగు సిబ్బంది



ఎమ్మెల్యే విజేత బండారును సత్కరిస్తున్న ఇటుక బట్టీల నిర్వాహకులు

అమలాపురం టౌన్, జూన్ 15: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అమలాపురం ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సీహెచ్ కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, కోశాధికారి జె.శర్మ ఆధ్వర్యంలో పెన్షనర్ల బృందం శనివారం ఆనందరావును కలుసుకుని సత్కరించింది. పెన్షనర్లకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ నాయకులు ఎం.సాయివరప్రసాదరావు, టీవీ శర్మ, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కాశి వెంకట్రావు, చొల్లంగి సత్యసాయిబాబా, మంగిపూడి శ్రీరామచంద్రమూర్తి, షాహీరా, మోపూరి బాబూరావు, కలిగినీడి ఉదయభాస్కర్, మండవిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం, వాసంశెట్టి చినబాబు తదితరులు ఆనందరావును కలిసి సత్కరించారు.మాజీ ఎంపీపీ చిప్పల యామినీపద్మప్రియ-నరేష్‌కుమార్ దంపతులతో పాటు కోలా నరసింహస్వామి, వై.చంద్రశేఖర్, లంకే బాలకృష్ణ ఆనందరావును అభినందించారు. హోం మంత్రి వంగలపూడి అనితను తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి అధికారి జయవెంకటలక్ష్మి, సీనియర్ నాయకుడు అల్లూరి ప్రసాద్‌రాజు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు.

హరీష్‌మాధుర్‌కు అభినందనలు

అమలాపురం టౌన్, జూన్ 15: అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, నల్లా రామకృష్ణతో పాటు వివిధ మండలాల బాధ్యులు శనివారం కలుసుకుని సత్కరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు దాట్లబాబు ఆధ్వర్యంలో పలువురు హరీష్‌మాధుర్‌ను కలుసుకుని మెమెంటో అందజేసి సత్కరించారు.

బండారుకు ఇటుక బట్టీల నిర్వాహకుల అభినందన

ఆలమూరు, జూన్ 15: కొత్తపేట ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన బండారు సత్యానందరావును ఆలమూరు ఇటుక బట్టీల యూనియన్ నాయకులు శనివారం గజమాలతో సత్కరించి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఇటీవలి కాలం లో బట్టీల నిర్వహణ కష్టతరంగా మారిందని, తాము తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని వారికి బండారు హామీనిచ్చారు.

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన వెలుగు సభ్యులు

రాయవరం, జూన్ 15: సార్వత్రిక ఎన్నికల్లో మన విజయం సాధించి నాల్గవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం రాయవరం వెలుగు డిపార్టుమెంట్‌కు చెందిన సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. వెలుగు ఏపీఎం నాజర్ ఆధ్వర్యంలో సిబ్బంది మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల కార్యాలయానికి వెళ్లి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వేగుళ్లకు మున్సిపల్ ఉద్యోగుల సత్కారం

మండపేట, జూన్ 15: మండపేట నియోజకవర్గం నుంచి వరుసగా నాల్గవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి తొలిసారిగా మున్సిపల్ కార్యాలయంలో అధికారుల తో సమీక్షా సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వేగుళ్లను మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాణి, వైస్ ఛైర్మన్‌లు, పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారాయ్యబాబు, కమీషనర్ రాము. డీ.ఇ.ఇ శ్రీనివాస్ తదితరులు సత్కరించారు.

హోంమంత్రిని కలిసిన పి.గన్నవరం ఎమ్మెల్యే

మామిడికుదురు, జూన్ 15: పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హోంమంత్రి వంగలపూడి అనితను అంతర్వేదిలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హోం మంత్రికి మొక్కతోపాటు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఎమ్మెల్యేతో పాటు మహ్మద్ ఖాశిం రజా తదితరులు ఉన్నారు.

ఎంపీ హరీష్‌ను కలిసి ఎంపీడీవో బృందం

అల్లవరం, జూన్ 15: అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్‌ను అల్లవరం ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, అధికారులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, పంచాయతీల కార్యదర్శులు అడబాల రాంబాబు, చిక్కం శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

అన్న క్యాంటీను పునఃప్రారంభానికి చర్యలు

ముమ్మిడివరం, జూన్ 15: ముమ్మిడివరంలోని అన్న క్యాంటీన్ పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్టు నగర పంచాయతీ కమిషనరు జి.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పేదలకు అతి తక్కువ రేటుకు ఆహారాన్ని అందించేందుకు ఏర్పాటుచేసిన అన్న క్యాంటీనును తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ముమ్మిడివరం బళ్ల గేటు సెంటర్లో గతంలో టీడీపీ హయాంలో అన్న క్యాంటీను ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత దానిని మూసివేశారు. ఆ భవనంలో వార్డు సచివాలయం నిర్వహిస్తున్నారు. అన్న క్యాంటీను ప్రారంభించాలని నూతన ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో నగర పంచాయతీ కమిషనరు జి.వెంకట్రామిరెడ్డి శనివారం సిబ్బందితో కలిసి వెళ్లి ఆ భవనాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో సచివాలయాన్ని నగర పంచాయతీ కార్యాలయానికి మార్పు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

పట్టణాభివృద్ధికి మున్సిపల్ ఉద్యోగులు సహకరించాలి

● సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే విజేత వేగుళ్ల పిలుపు

మండపేట, జూన్ 15: పట్టణాభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వాములై ప్రభుత్వానికి సహకరించాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఉద్యోగులను కోరారు. మండపేట పట్టణ మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉద్యోగు లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నాల్గవసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన తొలిసారిగా కార్యాలయంలో అధికారులు సిబ్బందితో వివిధ అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. మండపేట మున్సిపాల్టీని రాష్ట్రస్థాయిలోనే అగ్రగామిగా నిలపాలని ఆయన కోరారు. వేగుళ్ల మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి సిబ్బందికి వివరించారు. పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న అసుపత్రి నిర్మాణంకోసం ఏమేరకు నిధులు అవసరం అవుతుందని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ విభాగంలో డబుల్ ఎంట్రీ వివరాలు, రెవెన్యూ విభాగంలో ఉన్న 50లక్షల పన్ను బకాయిలు, గురించి ఆయన ఆరా తీశారు. పట్టణంలో వున్న మున్సిపల్ దుకాణాలు సముదాయానికి సంబంధించి 7 విడతలు వేలం నిర్వహించిన తర్వాత ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించారా? లేదా అని ఆరా తీశారు. మున్సిపల్ దుకాణాల సముదాయం మార్పులు చేర్పులు ఏక్కడెక్కడ జరిగాయనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. . సమీక్షా సమావేశంలో ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారా ణి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ బి.రాము, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్. సచివాలయ ఉద్యోగులు వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

'బీఎల్‌వోలకు వేతనాలు చెల్లించాలి'

మామిడికుదురు, జూన్ 15: ఎన్నికల విధుల్లో పాల్గొన్న బూత్ లెవెల్ అధికారులకు చెల్లించాల్సిన వేతనాలను చెల్లించాలని కోరుతూ వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎం.మేరికమ్మకు శనివారం బీఎల్‌వోలు అందించారు. మూడు నాలుగు సంవత్సరాలుగా తమకు వేతనాలు చెల్లించలేదన్నారు. తమకు ఏడాదికి రూ.6వేలు చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ.24వేలు చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. టి.శ్రావణి, కె.సత్యలత, టి.రోజా, సీహెచ్ మనీషా, జె.ఫాతిమా, ఎన్.సుధీర్, ఎం.సుభాష్, కె.ప్రవీణ్, కె.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కుండలేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కాట్రేనికోన, జూన్ 15: పవిత్ర కుండలేశ్వర క్షేత్రంలో శనివారం కుండలేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో బాదంపూడి కృష్ణశాస్త్రి, కామేశ్వరి, వెలవలపల్లి మణికంఠ, సత్యశ్రీ దంపతుల నిర్వహణలో పూజాకార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ప్రముఖ వేద పండితుడు కాళ్ళకూరి దుర్గాప్రసాద్ ఆచార్యత్వంలో 15మంది రుత్విక్కులు పూజలు నిర్వహించారు.

30న హోమ్‌గార్డ్ పోటీ పరీక్ష

యానాం, జూన్ 15: పుదుచ్చేరి పోలీస్‌శాఖలో ఖాళీలను భర్తీ చేసేందుకు హోమ్‌గార్డు ఉద్యోగాల పోటీ పరీక్షను ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి పంకజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షను ఈనెల 16న నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అదేరోజు యూపీఎస్సీ పరీక్ష జరగనుండటంతో హోమ్‌గార్డు పరీక్షను రీషెడ్యూల్ చేసినట్లు వివరించారు.

వాడపల్లి టు తిరుపతి జనసైనికుడి పాదయాత్ర

ఆత్రేయపురం, జూన్ 15: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ తూర్పు గోదావరి జిల్లా సీతానగరానికి చెందిన దేవన కరుణానాయుడు పాదయాత్ర చేపట్టాడు. శనివారం ఆయన వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరుపతికి పాదయాత్ర బయల్దేరాడు.

నీతిపూడి గణపతిరావుకు నివాళి

పి.గన్నవరం, జూన్ 15: పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు వర్ధంతి సందర్భంగా పిగన్నవరం అక్విడెక్టు వద్ద ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలల జేఏసీ రాష్ట్ర సహ కన్వీనర్ కోట రామమోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, నల్లా పెద్దకాపు, దాసరి కాశీ, యన్నాబత్తుల నాగరాజు, సరెళ్ల ఆనందశాస్త్రి, పిల్లి మునసుబు, తదితరులు పాల్గొన్నారు.

బధిర పిల్లలకు ప్రత్యేక శిక్షణ

ఆత్రేయపురం, జూన్ 15: రాజమహేంద్రవరం స్వరాజ్య నగర్‌లో సంకల్పం సర్వీసు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలుకు బధిరుల ఆశ్రమ ప్రత్యేక శిక్షణా సంస్థలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకురాలు గంటా కనకదుర్గ తెలిపారు. బధిర పిల్లలకు స్పీచ్ థెరపీ, 1 నుంచి 10వ తరగతి వరకు ఉచిత విద్య హాస్టల్ సదుపాయంతో పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

మామిడికుదురు, జూన్ 15: పాశర్లపూడి గ్రామంలోని కడలి లక్ష్మీదుర్గ(33) అనే వివాహిత ఉరి వేసుకుని మరణించడంపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పాశర్లపూడి గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బొక్కా దుర్గామహేశ్వరావుకు భీమవరం వెంపకు చెందిన లక్ష్మీదుర్గతో పదేళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి యశీక(9), రుచిక(7) కుమార్తెలు ఉన్నారు. గత మూడేళ్లుగా భార్యాభర్తలు గొడవలు పడుతున్నారని ఈ నేపథ్యంలో మృతురాలు భీమవరంలోని ఓ పాలిటెక్నిక్ కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ స్వగ్రామంలోనే ఉంటుందని తెలిపారు. ఈనెల 13న లక్ష్మీదుర్గను తన అల్లుడు ఇతర రాష్ట్రంలో ఉన్నప్పటికీ తన కుమార్తెను తండ్రి కడలి రమేష్ అత్తవారి గ్రామమైన పాశర్లపూడిలో వదిలి వెళ్లగా శనివారం తెల్లవారుజామున తన కుమార్తె ఉరి వేసుకుందని సమాచారం రావడంతో పాశర్లపూడి వచ్చారు. ఈఘటనపై మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు

ముమ్మిడివరం, జూన్ 15: పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో వసతిగృహాల్లో దోమలు రాకుండా మలాథియన్ ద్రావణాన్ని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పిచికారీ చేయించారు. అమలాపురం సబ్ యూనిట్ అధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలోని ముమ్మిడివరం ఎస్సీ బాలికలు, బీసీ బాలుర కళాశాల బీసీ, ఎస్సీ వసతిగృహాలు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వసతిగృహంలో శనివారం మలాథియాన్ పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.సంపూర్ణ, ఏఎన్ఎం పి.రాధమ్మ, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పాఠశాల కిట్‌ను అందించాలి

● స్టేట్ కౌన్సిల్‌ఫర్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అబ్జర్వర్ మాధవీలత

అంబాజీపేట, జూన్ 15: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి కిట్ అందించేలా చర్యలు తీసుకుంటున్నామని స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ అబ్జర్వర్ మాధవీలత అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్టాక్ పాయింట్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌లోని పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, టైలు, బెల్ట్‌లు, షూలు, సాక్సులు తదితర రికార్డులను పరిశీలించారు. ఈ నెల 22వ తేదీలోపు 7వ తరగతి పాఠ్యపుస్తకాలతో పాటు మిగిలిన విద్యార్థులకు అవసరమైన కిట్లు అందిస్తామన్నారు. ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలను ఉపయోగించాలి: ఎంఈవో

ముమ్మిడివరం, జూన్ 15: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలను ఉపయోగించాలని ముమ్మిడివరం ఎంఈవో బొజ్జా రమణశ్రీ పేర్కొన్నారు. అలాకాకుండా వేరే ఇతర పబ్లిషర్స్‌కు సంబంధించిన పాఠ్య పుస్తకాలను ఏ పాఠశాలలోనైనా ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలకు ఇండెంట్ పెట్టకుండా వేరే పబ్లిషర్స్ పుస్తకాలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముమ్మిడివరంలోని భాష్యం పాఠశాలలో సహస్ర పబ్లిషర్స్‌కు సంబంధించిన పుస్తకాలు విక్రయిస్తున్నట్టు తమ తనిఖీలో వెల్లడైందన్నారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ

కపిలేశ్వరపురం, జూన్ 15 : మండలంలోని 51 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు అంగర స్టాక్ పాయింట్ నుంచి స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్నట్లు శనివారం ఎంఈవో కె.తాతారావు తెలిపారు. 20,564 నోట్‌బుక్స్, 3,124 షూస్, 2,057 బెల్ట్స్ వచ్చాయన్నారు. పాఠ్యపుస్తకాలు 27,393కు గాను, 22,521 రాగా 4,872 రావాల్సి ఉందన్నారు. అలాగే 3120 యూనిఫామ్స్, 3120 బ్యాగ్స్, 588 డిక్షనరీలకు గాను 417 రావాల్సి ఉందన్నారు.

'117 జీవోను రద్దు చేయాలి'

మండపేట, జూన్ 15: వైసీపీ ప్రభుత్వం అమలుచేసిన జీవో నెం.117వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. పాఠశాల తరగతులు మిడ్జి చేయటంవల్ల పేదవిద్యార్థులకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షగా తయారైందన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు దూళి జయరాజుమాదిగ, జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ మాదిగలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నాశనమైందని ఆరోపించారు. టీడీపి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 117 జీవోను రద్దుచేయాల ని మంత్రి లోకేష్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సోషల్‌మీడియా సభ్యులు ఎం.సూరిబాబు, సిర్రా జోజిబాబు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

అమలాపురం టౌన్, జూన్ 15: అబ్బిరెడ్డి రామదాసు 75వ జయంతిని పురస్కరించుకుని అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం అమలాపురంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అబ్బిరెడ్డి సురేష్ అధ్వర్యంలో జరిగిన శిబిరంలో 75 మంది యువకులు రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన నిమ్మకాయల జగ్గయ్యనాయుడు ట్రస్టు ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఇంటర్ విద్యార్థిని హెచ్.ప్రవల్లికకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. గంగుమళ్ల శ్రీనివాస్, దూడల ఫణి, తిక్కిరెడ్డి నేతాజీ, జంగా అబ్బాయివెంకన్న, మండేలా బాబి, తిక్కిరెడ్డి ఆదినారాయణ, కర్రి రాఘవ, రాము, మూర్తి, బట్టు పండుపాల్గొన్నారు.



రాజోలులో ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఆర్టీసీ డిపో ఎదుట నాయకుల ధర్నా

రాజోలు, జూన్ 15: రాజోలు ఆర్టీసీ డిపో బస్సు ప్రమాదంలో గత నెల 14వ తేదీన ఆరుగురు మృతి చెందడంపై రాజోలు ఆర్టీసీ డిపో వద్ద యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేఎస్వీ రావు మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రమాదాలకు కారణమవుతున్న డబుల్ డ్యూటీలను రద్దుచేసి డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతనెల జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన కండక్టరు కె.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వెంటనే కల్పించాలంటూ నినాదాలతో ఆర్టీసీ కాంపెక్సు ఆవరణ అంతా మార్మోగింది. మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ చట్టం ప్రకారం డ్యూటీకి డ్యూటీకి మధ్య కనీసం 9 గంటలు విశ్రాంతి లేకుండా డ్యూటీకి అనుమతించరాదని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఎస్ నారాయణ,ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.గణపతి, అసోసియేషన్ కార్యదర్శి కుమారి పాల్గొన్నారు.

నూతన హోంమంత్రిని కలిసిన అధికారులు

అంతర్వేది, జూన్ 15: కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను శనివారం ఉదయం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి కోనసీమ జిల్లాకు విచ్చేసిన మంత్రి అనితకు పోలీసులు గౌరవ వందనం చేశారు.

అంతర్వేదికి చేరుకున్న పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న అంతర్వేదిపాలెం పుల్లయ్య, టీడీపీ నాయకులు

అంతర్వేది/మలికిపురం, జూన్ 15: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురంలోను, రాజోలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా దేవ వరప్రసాద్, అమలాపురం ఎంపీగా గంటి హరీష్‌మాధుర్‌లు అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొంది రాష్ట్రానికి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో మలికిపురం సెంటర్ నుంచి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు అంతర్వేదిపాలెం పుల్లయ్య శనివారం పాదయాత్ర చేసి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, గుండుబోగుల పెద్దకాపు, అడబాల యుగంధర్, తాడి సత్యనారాయణ, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, కొల్లు మహాలక్ష్మి, కొల్లు రాము, కౌరు శ్రీనివాస్, పోతురాజు కృష్ణ, పిండి సత్యనారాయణ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే నగర బహిష్కరణే: ఏఎస్పీ

అమలాపురం టౌన్, జూన్ 15: రౌడీషీటర్లు అల్లర్లకు పాల్పడితే నగర బహిష్కరణతోపాటు పీడీ యాక్టు అమలు చేస్తామని అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా హెచ్చరించారు. అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో శనివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాటిని నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మంత్రివర్గంలో యాదవులకు సముచిత స్థానం

అమలాపురం టౌన్, జూన్ 15: రాష్ట్ర మంత్రివర్గంలో యాదవులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత కల్పించడం పట్ల అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా శాఖ హర్షం ప్రకటించింది. శనివారం అమలాపురంలో జిల్లా కన్వీనర్ మట్ట రాంబాబు, సహ కన్వీనర్ కోరశిక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. యాదవ సామాజికవర్గానికి చెందిన కొలుసు పార్థసారధి, సత్యకుమార్ యాదవ్, సవితలకు స్థానం కల్పించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్, దగ్గుబాటి పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా సంఘ సభ్యులు దండుమేను సూర్యనారాయణ, కైల శోభన్‌బాబు, కానుబోయిన దుర్గాప్రసాద్, మేకల వెంకటేశ్వరరావు, సూరిమేను సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'అర్హులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలి'

రావులపాలెం, జూన్ 15: మండలంలోని దేవరపల్లి, గోపాలపురం గ్రామాల్లో రావులపాలేనికి సంబంధించి రెవెన్యూ శాఖ ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఈ పట్టాల్లో అనర్హులను గుర్తించి అర్హులకు పట్టాలు అందించాలంటూ పలువురు రెవెన్యూ అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. గతంలో రెవెన్యూ శాఖ ఇచ్చిన పట్టాల్లో 80 శాతంమందికి పైగా సొంత ఇళ్లు కలిగి ఉన్నారంటూ సంబంధిత ఆధారాలను జత చేశారు. రిటైర్డ్ ఐఏఎస్‌తో విచారణ చేయించి అనర్హులను తొలగించి అర్హులైన తమకు పట్టాలు ఇప్పించాలని కె.రాణీదుర్గ, లంక కృపావతి, ఎం.కావ్య, వెంకటలక్ష్మితో పాటు పలువురు కోరారు.

మాలమహానాడు కార్యదర్శిగా రణదీప్‌కుమార్

మామిడికుదురు, జూన్ 15: మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నగరం గ్రామానికి చెందిన బొండాడ రణదీప్‌కుమార్ (టింకు) నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నియామక ఉత్తర్వులు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజ్ జారీ చేశారు. నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన టింకు మాట్లాడుతూ జిల్లాలో మాలమహానాడు బలోపేతానికి కృషి చేస్తానని, మాలల సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. టింకును పలువురు అభినందించారు.

బీటెక్ లేటరల్ ప్రవేశానికి అడ్మిషన్లు

యానాం, జూన్ 15: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించిన విద్యార్థులు లేటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా బీటెక్‌లో ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశించేందుకు సెంటాక్ (సెంట్రలైజ్డ అడ్మిషన్‌కమిటీ)ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తుందని ఒక ప్రకటనలో తెలిపింది. సెంటాక్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని పూర్తి వివరాలు సెంటాక్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

